కథ

# సూర్యోదయం

పేరి శ్యామలరావు



వాళ్ళు నడుస్తున్నారు. దట్టమైన చీకటిలో, చీకటిని మరింత చిక్కబరుస్తున్న పొదలనూ, పొదవాటి వృక్ష సమూహాలనూ దాటుకుని, అడవిలోని సన్నని కాలిబాట వెంట వాళ్ళు నడుస్తున్నారు. గాలికి చెట్ల ఆకులు చేసే శబ్దంలో వాళ్ళ పాదాల శబ్దం చిత్రంగా, లయగా వినపడుతోంది: ఎక్కడి నుండో మానవ మృగాల ఏడ్పుల రొదలు వికృతంగా వినపడుతున్నాయి. వాళ్ళదేమీ పట్టించుకున్నట్టు లేదు. వాళ్ళ దృష్టి ఎక్కడో అనంత దిగంతాలను మీటి, నక్షత్ర సమూహాలను దాటి పయనిస్తోంది. అడుగులు మాత్రం అలవాటైన దారి వెంట–

'ఎక్కడికి'? అంది ఆమె నిశ్శబ్దాన్ని భరించలేనట్లు.

"ఏమో?" నిర్లిప్తంగా ధ్వనించిందతడి గొంతు.

"అవునూ! నువ్వు నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?" హఠాత్తుగా ఏదో గుర్తు వచ్చినట్టు ప్రశ్నించిందామె!

నడుస్తున్న అతడి పాదాల్లో తడబాటూ, మనసులో ఉలికిపాటు కప్పిపుచ్చుకుంటూ "ఊ" అన్నాడు సంశయంగా!

"చాలా ధైర్యంగా నీ వెంట వచ్చేశాను, ఈ చీకట్లో" స్వగతంలో అనుకుంటున్నట్టు పైకే అనేసి చప్పన అతడి మొహంలోకి చూసిందామె.

అతడి పెదవులపై చిన్న చిరునవ్వు మెరిసి మాయమైనట్టు ఆమె ఊహించుకుంది!

ఎదురుగా వున్న పొదలోంచి ఓ కుందేలు పిల్ల దారికడ్డంపడి మరో పొదలోకి పరుగుపెట్టింది! ఎక్కడో ఓ నక్క ఏడ్పు స్వరంతో 'కుయ్యో' మంది! ఈ హఠాత్సంఘటనకి ఆమె భయపడి అతడి భుజాన్ని గట్టిగా పట్టుకుంది!

"భయం లేదు! కుందేలేగా" ఆమె చేతిపై తట్టి ధైర్యం చెప్పాడతడు! ఆమె సర్దుకుంది! నడక! నడక!! సంవత్సరాలకి సంవత్సరాలు అనంతంగా సాగే ప్రయాణం! ప్రేమప్రయాణం! ప్రేమికుల మధ్య ఓ అవగాహన నేర్పరచి, ఒకరిపై ఒకరికి అనురాగ బంధాల నేర్పరచే గమ్యంలేని ప్రయాణం! ప్రేమికులు ఒకరి హృదయంలో ఒకరు బందీలవటానికి చేసే విశ్వసోధనం!

తూర్పు నుండి వెలుగు రేఖలు కొద్దిగా పొడసూపుతున్నాయి. దూరంగా మైదానంపై కాంతి రేఖలు విచ్చుకుంటున్నాయి. ఇంకొద్ది దూరం నడిస్తే మైదానం, ఆకాశాన్నంటే శిఖరాలతో కొండలూ–

ఆమె అతడి భుజాన్ని ఆసరాగా చేసుకుని నడుస్తోంది: అతడి భుజాన్ని బిగించి పట్టుకోవడంలో ఆమెకతడిపై విశ్వాసమూ, నమ్మకమూ, అతడు తన చెంత వుంటే ప్రపంచాన్ని ధిక్కరించగలననే ధీమా ఆమె కళ్ళల్లో, ఆత్మవిశ్వాసం ఆమె నడకలో!

హఠాత్తుగా ఓ తీతువు వికృతంగా అరుస్తూ వారి తలల మీద నుండి చెట్లలోకి వెళ్ళి మాయమైంది! ఇంతలో వారికి ఎదురుగా ఉన్న పొద ఉధృతంగా కదిలింది! ఆమె భయ విహ్వలురాలై అతడిని అల్లుకుపోయింది! ఆ హఠాత్సంఘటనకి అతడు బిగుసుకుపోయాడు. ఆ పొద లోంచి అగ్నిగోళాల్లా మెరుస్తున్న రెండు కళ్ళు! క్షణం తరువాత పులి రూపంగా మారి వారి దారికడ్డుగా నిలుచుంది!

"పులి" ఆమె అరవలేదు! అతడి చొక్కాని బిగించి పట్టుకున్న చేయి వణుకుతున్న తీరు ఆమెలోని భయాన్ని చాటుతోంది!

ఆమె చేతిని విదిలించి కొడ్తూ అతడన్నాడు "పరుగెత్తు". పళ్ళ బిగువున అతడరచిన అరుపు ఆమె చెవులకు సోకలేదు! అతడు విదిలించిన చేతిని అలాగే ఉంచి ఆమె శిలా ప్రతిమే అయ్యింది! "రన్! పారిపో!! పరుగెత్తు!!!" అరుస్తూనే అతడు ప్రక్కనే ఉన్న వృక్షాన్ని క్షణాల్లో ఎక్కేశాడు. ఆమెలో కదలిక లేదు.

జరుగబోయే దారుణాన్ని తల్చుకుని అతడోక్షణం కళ్ళు మూశాడు! పులి నెమ్మదిగా ఆమె చుట్టూ తిరిగింది. రాయనుకుందేమో! అతడెక్కిన చెట్టు కిందే రెండు నిమిషాలు బైఠాయించింది! ఫలితం లేదనుకుని అడవిలోకి దౌడు తీసింది! చమటతో వంటికంటుకుపోయిన చొక్కాను ఆరబెట్టుకుంటూ అతడు క్రిందికు దిగాడు!

"పారిపోయింది" అన్నాడు ఆమెనుద్దేశించి, జీవంలేని నవ్వుతో! ఆమె తేరుకని అతడి వంక చూసింది! ఆ చూపులో తృణీకారం!

"చాలా భయమేసింది తెల్సా! నిన్ను చంపేస్తుందేమో అని! గాడ్ ఈజ్ గ్రేట్" అంటూ ఆమె చేతిలో పట్టుకుని ముందుకు నడిపించబోయాడు.

అతడి చేతినామె 'సున్నితం'గా విడిపించుకుంది!

ఆ నిశ్శబ్దాన్ని అతడు భరించలేకుండా ఉన్నాడు!

"ఐ లవ్ యూ" అన్నాడు వణుకుతున్న గొంతుతో! ఆ మాట ఆమెకి అసహ్యంగా వినిపించింది! అతడి వంక ఒక్కమారు అభావంతో చూసి మైదానం వైపు దృష్టి సారించింది! ఆమె కళ్ళల్లో కాంతి వలయాలు వలయాలుగా తిరుగుతోంది. ఆమె దృష్టి మైదానం దాటి, కొండల్ని దాటి సూర్యకాంతిలోకి ప్రయాణించింది!

అడవి చివర కొచ్చారిద్దరూ! ఇంకొక్క అడుగు వేస్తే ధవళ కాంతితో మెరిసే నూతన ప్రపంచంలోకి అడుగు పెడతారు.

ఆమె ఆగింది! అర్థంకాక అతడూ ఆగేడు!

ఆమె అంది ఖంగుమన్న స్వరంతో– "నువ్వు పిరికివాడివి స్వార్థపరుడివి! నిన్ను ప్రేమించిన వాళ్ళను రక్షించుకునే శక్తి నీకు లేదు. పిరికివాళ్ళకి, స్వార్థపరులకీ ప్రేమించే శక్తీ, ప్రేమింపబడే అర్హతా ఉండవు" స్థిరత్వం నిండిన ఆమె స్వరం అడవిలో ప్రతిధ్వనించింది.

అతడు నిర్విణ్ణుడై శిలలా బిగుసుకుపోయాడు! ఏదో అనబోయాడు. స్వరం పెగలక అది దగ్గు రూపంలో బైటకొచ్చింది! వెళ్ళిపోతున్న ఆమెని పిలుద్దామనుకున్న అతడి చేయి అశక్తతతో క్రిందకు వాలింది. అతడలాగే చీకట్లో నిలబడిపోయాడు.

ఆమె ముందుకు సాగిపోయింది! ప్రేమైక ప్రపంచంలోకి ఏదో గుర్తు వచ్చి ఆమె పెదవులపై విరిసిన దరహాస రేఖ తళుక్కున మెరుపులా మెరిసి మాయమైంది!

మైదానం మీద సూర్యకాంతి మహాసముద్రంలా పరుచుకుంది.